సాక్షి నల్లగొండ

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



బుద్ధవనం సందర్శన

అటవీశాఖ రీజనల్ డైరెక్టర్ త్రినాథ్‌రావు బుధవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. - 8లో



రైతుల కోసమే గోదాంలు

రైతుల కోసమే గ్రామాల్లో గోదాంలు నిర్మిస్తున్నామని నాబార్డు రాష్ట్ర ఈఈ గోపాల్‌రావు అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం 34°/17°

వాతావరణం

ఆకాశం ఉదయం పొగమంచుతో మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రోత్సాహక నిధులు విడుదల చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ సునీత, నార్మూల్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్: నార్మూల్ మదర్ డెయిరీ పరిధిలోని పాడి రైతులకు అందజేయాల్సిన లీటర్‌కు రూ.4 చొప్పున ప్రోత్సాహక నిధులు రూ.4 కోట్ల 60లక్షలను విడదల చేసి ఆదుకోవాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, నార్మూల్ మదర్‌డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



జైల్ సూపరింటెండెంట్‌కు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

నల్లగొండ క్రైం : మానవ మనుగడలో కంటి చూపు కీలకమని, అర్హులైన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా జైల్ సూపరింటెండెంట్ దేవ్‌లా నాయక్ అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం నల్లగొండలోని జిల్లా జైల్లో అధికారులు, సిబ్బంది, ఖైదీలకు వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండల్‌రావు, డిప్యూటీ జైలర్ వేణుగోపాల్‌రెడ్డి, జైలర్ అనిల్, జనార్దన్‌రెడ్డి, నరేష్, ఫణీంద్ర, రామలింగం, మహేష్‌రాజు, గోవిందు, వెంకన్న ఉన్నారు.

చందంపేట జెడ్పీటీసీ రాజీనామా ఆమోదం



రమావత్ పవిత్ర

చందంపేట: చందంపేట జెడ్పీటీసీ సభ్యురాలు రమావత్ పవిత్ర తన రాజీనామా పత్రాన్ని ఈనెల 4న కలెక్టర్‌కు సమర్పించారు. ఈ రాజీనామాను కలెక్టర్ బుధవారం ఆమోదించారు. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేసినట్లు రాజీనామాలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. రమావత్ పవిత్ర 2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నేనావత్ బుజ్జిపై గెలుపొందారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఎన్నికల్లో పోటీ చేసినట్లు బుజ్జి కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు వెలువడనున్న నేపథ్యంలో రాజీనామా చేసినట్లు పలువురు పేర్కొంటున్నారు. జెడ్పీటీసీ రాజీనామా ఎలక్షన్ కమిషన్‌కు చేరడంతో ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.



లింగమంతుల స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



పెద్దగట్టు నుంచి దేవరపెట్టెను కేసారం తరలిస్తున్న యాదవులు



బోనం వండుతున్న మున్న, మెంతబోయిన వంశస్తులు

కేసారం చేరిన దేవరపెట్టె

దురాజ్‌పల్లిలోని శ్రీ లింగమంతుల స్వామి (గొల్లగట్టు) జాతరకు నాలుగో రోజూ బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం భక్తుల రద్దీ తక్కువగా ఉన్నా మధ్యాహ్నం తర్వాత పుంజుకుంది. నెలవారం కార్యక్రమాన్ని మున్న, మెంతబోయిన వంశస్తులు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి బోనం వండి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం దేవరపెట్టెను కేసారం గ్రామానికి తరలించి దేవరగుడిలో పెట్టి పూజలు చేశారు. - సూర్యాపేట, చివ్వెంల 8లో

నాణ్యమైన విద్య అందించాలి

- అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా



డీఈఓ భిక్షపతితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఉపాధ్యాయులకు సూచించారు. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ఎంపికైన చిట్యాల మండలంలోని ఆరెగూడెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆమె వెంట డీఈఓ భిక్షపతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకే తనిఖీలు

నల్లగొండ క్రైం: ప్రమాదాల నివారణకే వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ అపూర్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. తన ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు వాహనాలను తనిఖీ చేసి ట్రాఫిక్ నిబంధనలు పాటించని 568వాహనదారులపై కేసు నమోదు చేశారని, మొత్తంగా రూ.2,04,200 జరిమానా విధించారని పేర్కొన్నారు. నిబంధనలపై వాహనదారులకు కౌన్సిలింగ్ కూడా ఇచ్చారని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోజూ తనిఖీలు ఉంటాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

డ్రా చేసిన డబ్బులు తిరిగి జమ చేసేలా!

- గొర్రెల యూనిట్ల పంపిణీ విషయంలో కొత్త మెలిక
- మునుగోడు ఉప ఎన్నిక సమయంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- వెంటనే డ్రా చేసుకున్న కొందరు
- ఇప్పుడేమో గొర్రెలనే కొనిస్తామంటున్న అధికారులు



మునుగోడు: రెండో విడత గొర్రెల పంపిణీ పథకం కింద మునుగోడు ఉప ఎన్నిక సమయంలో నియోజకవర్గ వ్యాప్తంగా గొల్ల, కుర్మల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిన నగదును డ్రా చేసిన లబ్ధిదారులు తిరిగి తమ ఖాతాల్లో చేయకుంటే వారికి సంక్షేమ పథకాలను నిలిపివేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు విశ్వసనీయ వ్యక్తుల ద్వారా తెలిసింది. గత మంగళవారం చండూరులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి గొల్ల, కుర్మల అవగాహన సదస్సుకు హాజరైన ప్రజా ప్రతినిధులు అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండో విడత 2లక్ష 50 వేల మందికి గొర్రెలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రమంతటా గొర్రెలు ఇచ్చి మునుగోడులో నగుదు ఇచ్చే అవకాశం లేదని తేల్చి చెప్పారు. ఎలాగైనా సరే నగదు డ్రా చేసిన వారినుంచి తిరిగి ఖాతాల్లో చేయించి గొర్రెలను ఇప్పించాలని ఆదేశించారు. ఏ గ్రామంలోనైతే డబ్బులు డ్రా చేశారో ఆ గ్రామంలోని లబ్ధిదారులు తిరిగి నగదు జమ చేయిస్తేనే ఆ గ్రామంలోని మిగతా లబ్ధిదారులకు గొర్రెలు ఇప్పించాలని నిర్ణయించినట్టు సమాచారం. అవసరమైతే ఆ వ్యక్తులపై పోలీసు కేసు నమోదు చేసైనా నగదు జమ చేయించాలని సూచించినట్లు తెలిసింది. నియోజకవర్గం వ్యాప్తంగా మొత్తం 7,600 మంది లబ్ధిదారులు ఉండగా, అందులో నగదు డ్రా చేసినవారు దాదాపు 400లకుపైగా ఉంటే అందులో ఇప్పటి వరకు సగం మంది తిరిగి జమ చేసినట్లు అధికారులు చెప్పుతున్నారు. మిగిలిన వారి అందరిని జమచేయించి నాలుగైదు రోజుల్లో గొర్రెల కొనుగోలుకు ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఏ గ్రామంలోనైతే నగదు డ్రా చేసి జమచేయని లబ్ధిదారులు ఉన్నారో వారు చేసేలా మిగతా లబ్ధిదారులు బతిమిలాడుతున్నట్లు తెలిసింది.

బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలి



కరపత్రాలను అందజేస్తున్న సుధాకర్, మల్లయ్య

నకిరేకల్ : బీఆర్‌ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య పిలుపునిచ్చారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా రెండోరోజు బుధవారం నకిరేకల్‌లోని పలు వార్డుల్లో వారు పర్యటించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకరబోయిన నర్సింహయాదవ్, లింగాల వెంకన్న, రాచకొండ లింగయ్య, యాసా కరుణాకర్‌రెడ్డి, బొప్పని యాదగిరి, నకిరేకంటి శ్రీను, నాగరాజు, కొండల్, బొంబాయి శ్రీను పాల్గొన్నారు.

పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పంచాయతీ కార్మికులు

కేతేపల్లి : గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న పాలకుర్తి నుంచి హైదరాబాద్ వరకు చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతెపాక వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం కేతేపల్లిలో పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం మండల అధ్యక్షుడు ఏడాకుల కోటయ్య, ప్రధాన కార్యదర్శి జి.ఆశీర్వాదం, సైదులు, లింగయ్య, జానయ్య, వెంకన్న, జ్యోతి, శోభ, రమణ, నాగమణి, కవిత పాల్గొన్నారు.

బదిలీ చేస్తే కష్టమే..!

ఇతర జిల్లాల నుంచి వచ్చిన టీచర్లకు అవకాశం కల్పించిన ప్రభుత్వం

- సీనియారిటీ ప్రకారం బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశం
- చందంపేట, డిండి లాంటి దూర ప్రాంతాల్లో మళ్లీ ఏర్పడనున్న ఖాళీలు
- ఆ ప్రాంత విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం



నల్లగొండ: జిల్లాలో మారుమూల ప్రాంతాలైన చందంపేట, డిండి మండలాల పరిధిలోని గ్రామాలు, తండాల్లో ఇప్పటి వరకు పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీల్లో వెళితే ఆయా ప్రాంతాల విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొనసాగుతుండడం వల్ల వారు తమకు దగ్గరి ప్రాంతాల్లోనే పోస్టింగ్‌లు తీసుకుంటున్నారు. దీంతో దూర ప్రాంతాలకు ఎవరూ వెళ్లని పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా మారుమూల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారనుంది.

బదిలీల్లో అవకాశం ఇవ్వడంతో..

జిల్లాలో 1,483 ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా టీఆర్‌టీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) నిర్వహించకపోవడం, ఏటా ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతుండడంతో ఆయా కేటగిరీల్లో పోస్టులు ఖాళీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ పాఠశాలలకు ఉపాధ్యాయుల అవసరం రీత్యా గత సంవత్సరం జనవరి 6న ప్రభుత్వం 317 జీఓ ద్వారా ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు వచ్చిన 319 మంది ఉపాధ్యాయులకు దగ్గర ప్రాంతాల్లో ఖాళీ పోస్టులను చూపకుండా బలవంతంగా దూర ప్రాంతాలకు పంపారు. దీంతో సంవత్సరం నుంచి చందంపేట, డిండి ఇతర దూర ప్రాంతాల్లో పనిచేసిన ఉపాధ్యాయులు అక్కడ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేశారు. దీంతో ఆయా మండలాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అంది విద్యావ్యవస్థ కొంచెం మెరుగున పడింది.

ఇప్పట్లో టీఆర్‌టీ లేనట్టేనా..?

ప్రభుత్వం వివిధ కేటగిరీల వారీగా పదోన్నతులు కల్పిస్తున్నందున స్కూల్ అసిస్టెంట్లు హెడ్‌మాస్టర్లుగా ఉద్యోగోన్నతిపై వెళ్తుండగా ఆ స్థానాల్లో ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొంది వస్తారు. దీంతో ఇప్పటికే జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్‌జీటీ పోస్టులతోపాటు పదోన్నతులతో పెద్ద సంఖ్యలో ఖాళీ పోస్టులు ఏర్పడుతున్నాయి. వీటిలో మారుమూల ప్రాంత పాఠశాలల్లోని ఖాళీలే అధికంగా ఉంటాయి. ఇప్పట్లో ప్రభుత్వం టీఆర్‌టీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) వేసినా వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఉపాధ్యాయులను భర్తీ చేసే అవకాశం లేదు. కాబట్టి దూరప్రాంతాల్లో సంవత్సరం కాలం నుంచి అందుతున్న నాణ్యమైన విద్యా మళ్లీ ఆయా ప్రాంతాల విద్యార్థులకు దూరమయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కరోనా తర్వాత జిల్లాలో గతంలో పనిచేస్తున్న 325 మంది విద్యావలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోలేదు. ప్రస్తుతం ఉన్న ఖాళీల్లో విద్యావలంటీర్లను తీసుకున్నా మారుమూల ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేది కష్టమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని..

ప్రస్తుతం బయటి జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు కూడా పాత జిల్లాల సీనియారిటీ ప్రకారం బదిలీకి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటి వరకు దూర ప్రాంతాల్లో పనిచేసిన వారు ప్రస్తుత బదిలీల్లో అక్కడి నుంచి తమకు దగ్గరగా ఉండే ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఏర్పడింది. దీంతో వేలాది మంది ఉపాధ్యాయులకు కింది స్థాయి కేటగిరీ నుంచి పైస్థాయి కేటగిరీకి పదోన్నతి లభిస్తుండడంతో హెడ్ మాస్టర్, ఎస్‌జీటీ పోస్టులు ఖాళీ అవుతున్నాయి.

నారసింహుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : స్వయంభూ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, స్వయంభూలకు బిందె తీర్థం, ఆరాధన చేశారు.అనంతరం బాలభోగం, మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. శ్రీస్వామివారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన గావించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవ, రాత్రి పవళింపు సేవ నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు.

అణగారిన వర్గాలు దేశాన్ని పాలించాలి

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్



బొమ్మకల్‌లో మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

మిర్యాలగూడ: నిజమైన ధర్మం అంటే అణగారిన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీలు దేశాన్ని పాలించడమేనని దళిత శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. ఆయన చేపట్టి 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర బుధవారం మాడ్గులపల్లి మండలం గుర్రప్పగూడెం, బొమ్మకల్, భీమనపల్లి, కల్వలపాలెం, ఆమనగల్లు గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అణగారిన వర్గాల వారు రాజకీయంగా చైతన్యం అయితేనే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాధికారం చూపించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. తెలంగాణాలో 90శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాన్ని స్థాపించడమే లక్ష్యంగా తాను 10వేల కి.మీ. స్వరాజ్య పాదయాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా నాయకులు ఎల్లయ్య, గిరి, మండల నాయకులు చందు, కృష్ణయ్య, సతీష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

‘మిర్యాల’లో సుందరీకరణ జాడేదీ?

- రహదారుల వెంట కనిపించని చెట్లు
- ప్రధాన రోడ్లపై పూర్తికాని డివైడర్ల పనులు
- ఎక్కడా ఏర్పాటు చేయని పార్కింగ్ స్థలాలు
- రోడ్లపైనే నిలుపుతున్న వాహనాలు
- ఇబ్బందుల్లో పట్టణ వాసులు



చెట్లు కనిపించని సాగర్ రోడ్డు



మధ్యలోనే నిలిచిన డివైడర్ పనులు

మిర్యాలగూడ టౌన్: పట్టణాల సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నా.. మిర్యాలగూడ పట్టణంలో ఆ ఊసే లేకుండా పోయింది. పట్టణంలోని రోడ్ల వెంట పచ్చదనం కూడా కనిపించడం లేదు. ప్రధానంగాసాగర్ రోడ్డు గతంలో పచ్చని చెట్లతో ఆహ్లాదంగా కనిపించేది. కానీ.. కోదాడ–జడ్చర్ల రహదారి విస్తరణలో భాగంగా చాలా చెట్లను ఇటీవల తొలగించారు. దీంతో రోడ్డంతా చెట్లు లేకుండా బోసిబోయి కనిపిస్తోంది. కొన్ని అభివృద్ధి పనులు కూడా పూర్తికాకపోవడంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది.

రోడ్డుపైనే పార్కింగ్

వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు నిత్యం వేల సంఖ్యలో పట్టణానికి వస్తుంటారు. చాలా వరకు అన్నిరకాల వస్తువులు సాగర్ రోడ్డులోనే దొరుకుతుండటంతో పాటు ఒకవైపు ఆర్టీసీ బస్టాండ్, మరోవైపు గణేష్ కూరగాయాల మార్కెట్, రైతు బజారులు ఇదే రోడ్డు ఉన్నాయి. ఈ రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో రోడ్లపైనే నిలుపుతున్నారు. అదే విధంగా ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ దగ్గర కార్మికులకు అడ్డగా ఉండటంతో పనుల కోసం వచ్చే జనంతో ఈ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు.

అసంపూర్తిగా డివైడర్లు

మున్సిపాలిటీలో జడ్చర్ల–కోదాడ ప్రధాన రహదారి అయిన సాగర్ రోడ్డులో మోహన్ కాంటా నుంచి రాజీవ్ చౌక్ వరకు చేపట్టిన డివైడర్ల నిర్మాణ కిలోమీటర్ వరకే పనులు ఒకవైపే పూర్తిచేశారు. ఇంకోవైపు మధ్యలోనే నిలిపేశారు. ఇప్పటి వరకు నిర్మించిన డివైడర్లు అక్కడక్కడా సిమెంట్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. పట్టణంలో 320 వరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా 40కే రక్షణ కంచె ఉంది. మిగిలిన వాటికి లేక ప్రమాదకరంగా మారాయి.

డ్రెయినేజీ అస్తవ్యస్తం

మున్సిపాలిటీలోని రోడ్ల వెంట, ఇళ్ల మధ్యలో డ్రెయినేజీ, పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఇళ్ల మధ్యలోనే మురుగు నీరు నిల్వ ఉంటోంది. దీంతో దోమలు, పందుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు, మిల్లు ద్వారా వస్తున్న వ్యర్థజలాలు చెరువు వైపు మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామన్న హామీలు నీటి మూటలుగా మారాయి. అదే విధంగా ప్రధాన నాలాలో సిల్ట్ తీయకపోవడంతో కంప చెట్లు, పూడికతో నిండిపోతోందని, మురుగు కారణంగా తాము రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని వివిధ కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిగ్నల్ లైట్లు పునరుద్ధరించాలి



“ మున్సిపాలిటీలో సుందరీకరణ పనులను చేపట్టాలి. ప్రధానంగా రోడ్ల వెంట, డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలి. ప్రధాన సెంటర్లలో సిగ్నల్ లైట్లను పునరుద్ధరించాలి. రోడ్ల వెడల్పు చేసి ట్రాఫిక్‌తోపాటు పార్కింగ్ కష్టాలను తీర్చాలి.

– రాపోలు పరమేష్, మిర్యాలగూడ

నాలాలో పూడికతీత విషయమై కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తా..



“ బంగారుగడ్డ, హనుమాన్‌పేట ప్రధాన నాలాలో పూడికతీత పనుల విషయంపై మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తా. పారిశుద్ధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడతాం. అవసరం ఉన్న చోట ఫాగింగ్ చేస్తాం.

– రవీందర్‌సాగర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

పనిచేయని సిగ్నల్ లైట్లు

మిర్యాలగూడ పట్టణంలో ట్రాఫిక్‌ను నియంత్రణకు ఆర్‌ఎస్ బ్రదర్స్ యాజమాన్యం వారు సుమారు రూ.మూడున్నర లక్షలు ఇవ్వడంతో ఆ నిధులతో మున్సిపల్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద, హనుమాన్‌పేటలోని అద్దంకి–నార్కట్‌పల్లి బైపాస్ వద్ద, తెలంగాణ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు నిరుపయోగంగా ఉంటున్నాయి.

నెలవారం.. జనహోరం


స్వామి వారిని దర్శించుకుని మెట్లపై నుంచి కిందికి వస్తున్న భక్తులు


పెద్దగట్టు జాతర పరిసరాల వ్యూ

నాలుగో రోజూ అదే జోరు

- పెద్దగట్టుకు భారీగా తరలివచ్చిన భక్తులు
- లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి నైవేద్యంగా బోనం చెల్లింపు
- కేసారం తరలిన దేవరపెట్టె
- నేడు మకరతోరణం తరలింపుతో జాతర పరిసమాప్తం

సూర్యాపేట/చివ్వెంల: శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు నాలుగో రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం గంపల ప్రదక్షిణతో వైభవంగా ప్రారంభమైన గొల్లగట్టు జాతరలో బుధవారం భక్తిశ్రద్ధలతో నెలవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యాదవ పూజారులు మున్న, మెంతబోయిన వంశస్తులు సాంప్రదాయ పద్ధతిలో చేపట్టారు. లింగమంతుల స్వామిని లక్షలాది మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నెలవారం ప్రత్యేకత ఇదీ..

పెద్దగట్టు లింగమంతుల స్వామి నాలుగో రోజు నెలవారం తంతును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలమందలు, జీవాలను పరీక్షించిన దేవతగా అవతరించిన చౌడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం చంద్రపట్నం వేసి పూజలు నిర్వహించిన నిద్రఘట్టంలో భాగంగా కేసారం గ్రామానికి చెందిన యాదవ పూజారులు బుధవారం కొత్త బోనం కుండ, గంపలో పూజా సామగ్రి, తొలి గొర్రెను తోలుకుని గట్టుకు చేరుకున్నారు. చంద్రపట్నంపై ఉన్న దేవరపెట్టె వద్ద పూజలు చేశారు. మున్న, మెంతబోయిన వంశస్తులు కొత్త కుండలో బోనాలు వండారు. లింగమంతులు, చౌడమ్మతల్లికి నైవేద్యంగా పెట్టారు. మెంతబోయిన వంశీయులు తెచ్చిన తొలిగొర్రెను పట్నంపై బలి ఇచ్చారు. ఈ తంతు జరుగుతుండగా మరో వైపు బైకాన్లు కథలు చెప్పడంతో దేవాలయం ఉగ్రూతలూగింది. ఆ తర్వాత మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం బైకాన్లకు, మరో భాగం మున్న వంశీయులకు ఇచ్చారు. మిగిలిన భాగం మెంతబోయిన వంశీయులు వంట చేసి ప్రసాదంగా తీసుకున్నారు. అనంతరం చంద్రపట్నం వేసి సమీపంలో నాగులమ్మ పుట్టలో పోశారు. తరువాత చౌడమ్మ, లింగమంతుల స్వామి విగ్రహాలు ఉన్న దేవరపెట్టెను తీసుకుని కేసారం బాటపట్టారు. దీంతో నెలవారం పండుగ ముగిసినట్లు అధికారులు ప్రకటించారు.

తల్లిదండ్రుల చెంతకు 25మంది పిల్లలు

జాతరలో తప్పిపోయిన 25 మంది పిల్లలను శిశు సంక్షేమశాఖ, పౌరసరఫరాల సమాచార శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పిల్ల లు తమ దగ్గరికి రావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ముగియనున్న జాతర

నాలుగు రోజులుగా లక్షలాది భక్తులు పూజలు అందుకుంటున్న పెద్దగట్టు లింగమంతుల జాతర గురువారంతో ముగియనుంది. సూర్యాపేట యాదవ బజార్‌నుంచి గట్టుకు తెచ్చిన మకరతోరణం గురువారం తిరిగి స్వస్థలానికి చేరనుంది. మకరతోరణం తీసుకెళ్లడంతో జాతర ముగుస్తుందని యాదవ కుల పూజారులు తెలిపారు.

జాతరను సందర్శించిన నాయకులు

పెద్దగట్టు జాతరను సూర్యాపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులుయాదవ్, తండు శ్రీనివాస్‌యాదవ్, జటంగి వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ చైర్మన్ వసంత సత్యనారాయణపిళ్లే, సుంకరబోయిన శ్రీనివాస్‌యాదవ్, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



ఉదయం మందకొడిగా... సాయంత్రం కిటకిట

నాలుగు రోజులుగా సాగుతున్న జాతరలో సోమవారం మినహా మిగతా రోజుల్లో ఉదయం భక్తుల రద్దీ తక్కువగా ఉంటూ జాతర పరిసర ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. మధ్యాహ్నానికి పుంజుకుని రాత్రికి భక్తులతో ఆలయ ప్రాంతాలు కిటకిట లాడుతున్నాయి. ఈ రద్దీతో జాతీయ రహదారిపై కూడా ట్రాఫిక్ స్తంభించి పోతుంది. వ్యాపారాలు కూడా సాయంత్రం బాగా సాగుతున్నాయి.

భేరీల మోతకు నృత్యం చేస్తున్న భక్తులు


పెద్దగట్టు జాతరలో భక్తుల కోలాహలం


దేవరపెట్టె వద్ద పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక తదితరులు


నాగుల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కంపుకొడుతున్న పెద్దగట్టు పరిసరాలు

పెద్దగట్టుతో పాటు పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయడంతో దుర్గంధం వస్తుండడంతో భక్తులు దుర్వాసన భరించలేక పోతున్నారు.

వ్యాపారులకు జరిమానా

జాతరలో పలువురు దుకాణాదారులు అధిక ధరకు కూల్‌డ్రింక్స్, వాటర్‌బాటిళ్లు విక్రయిస్తుండడంతో భక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో లీగల్ మెట్రాలజీ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీ చేసి జరిమానా విధించారు.

ప్రసాదాలను పరిశీలించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు

సూర్యాపేట: శ్రీ లింగమంతులస్వామి జాతరలో భక్తులకు ఇచ్చే పులిహోర, లడ్డు ప్రసాదాలను బుధవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు పరిశీలించారు. గాఢమైన పసుపు రంగును పులిహోర, లడ్డూలో కలుపుతున్నట్లు ఫిర్యాదు రావడంతో అప్రమత్తమైన అధికారులు నమూనాలను పరిశీలన నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. ఆహారభద్రత, తనిఖీ అధికారి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ లడ్డు, పులిహోర నమూనాలు సేకరించినట్లు తెలియజేశారు. వీరి వెంట సిద్దిపేట జిల్లా ఆహార తనిఖీ అధికారి కృష్ణమూర్తి, యాదాద్రి జిల్లా ఆహార తనిఖీ అధికారి స్వాతి, వనపర్తి జిల్లా ఆహార తనిఖీ అధికారి నీలిమ, లతీఫ్ పాల్గొన్నారు.


ప్రసాదాల తయారీని పరిశీలిస్తున్న అధికారులు

బాగా పనిచేశారు.. కడుపు నిండా తినండి


భోజనాలు వడ్డిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటక్రైం: దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సుధాకర్ పీవీసీ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. బుధవారం పోలీసు సిబ్బందికి ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ స్వయంగా భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్ పీవీసీ యాజమాన్యం, సీఐ సోమనారాయణ సింగ్, ఎస్సై విష్ణుమూర్తి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌ఓ

సూర్యాపేట: జాతర సమయంలో పచ్చబొట్లు, టాటూలు వేసే వారి పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కోటాచలం సూచించారు. పచ్చబొట్లు వేసే వారి వద్దకు ప్రత్యేక బృందాలను పంపించి వారు వేసే విధానాన్ని గమనించారు. పచ్చబొట్లు వేసే వారు కొత్త నీడిల్ ఉపయోగిస్తున్నారా లేదా అని భక్తులుగమనించాలని కోరారు. పాత నీడిల్‌లు వాడవద్దని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హర్షవర్ధన్ పచ్చబొట్లు వేసే విధానాన్ని పరిశీలించారు. వీరి వెంట జిల్లా అసంక్రమిత వ్యాధుల అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ,భూతరాజు సైదులు తదితరులు ఉన్నారు.


పచ్చబొట్టు వేసే వారిని హెచ్చరిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం



చలువ పందిళ్ల కింద చల్లగా..

దైవదర్శనానికి వచ్చిన భక్తులకు చలువ పందిళ్లు చల్లని నీడనిస్తున్నాయి. గుట్టపైకి మెట్ల ద్వారా ఎండలో వచ్చిన భక్తులు పైకి రాగానే కాసేపు ఈ పందిళ్ల కింద సేద దీరి దైవ దర్శనం చేసుకుంటున్నారు. అనంతరం తమతో తెచ్చుకున్న ప్రసాదాలను ఈ ప్రాంతంలో సేదదీరుతూ ఆరగిస్తున్నారు.

చిన్నారులు జాలీగా..

జాతరలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు భక్తులు వేలాది సంఖ్యల్లో తరలివస్తున్నారు. మధ్యాహ్నం నుంచి క్రమక్రమంగా భక్తుల రాక పెరిగి రాత్రి వరకు ప్రదర్శన శాలలు కిక్కిరిసిపోతున్నాయి. జమున సర్కస్, రంగులరాట్నం, డ్రాగన్ రైలు, బ్రేక్ డ్యాన్స్‌లు ఎక్కువగా రద్దీతో ఉంటున్నాయి. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులతో ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.


కారులో షికారు చేస్తున్న చిన్నారులు

---

15 వరకు 'నవోదయ' గడువు పెంపు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటానికి గడువును ఫిబ్రవరి 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ స్వర్ణలత ఒక ప్రటకనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని ఆరో తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 16, 17 తేదీల్లో ఆన్‌లైన్‌లో తప్పులు సరిచేసుకోవటానికి వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందని తెలిపారు. జెండర్(మేల్/ఫీమేల్), కేటగిరీ(జనరల్/ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ), ప్రాంతం(అర్బన్/రూరల్), డిజేబిలిటీ, ప్రవేశ పరీక్ష రాసే మాధ్యమంను మాత్రమే మార్చేందుకు అనుమతిచ్చినట్లు తెలిపారు.

'అనురాగ్'లో రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్

అనంతగిరి: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆరో ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను స్థానిక అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రారంభంకానున్నట్లు ప్రిన్సిపాల్ డా. ఎంవీ శివప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ.. నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మేడ్చల్, సిద్దిపేట, రంగారెడ్డి, మెదక్, వరంగల్ జిల్లాల నుంచి 1250మంది క్రీడాకారులు ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రానికే క్రీడాకారులు అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకున్నారని, క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులతో పాటు కోర్టులను సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ ఏ. పుల్లయ్య, డా. శ్రీనాథ్, ఎమ్మెల్సీ, అనురాగ్ కళాశాల కరస్పాండెంట్ డా. పల్లా రాజేశ్వరరెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.


మైదానాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

రైతుల కోసమే గోదాంల నిర్మాణం


గోదామును పరిశీలిస్తున్న నాబార్డు ఈఈ గోపాల్‌రావు తదితరులు

త్రిపురారం: రైతులు కోసం గ్రామాల్లో పీఏసీఎస్ కేంద్రాల వద్ద నాబార్డు సహకారంతో గోదాంలను నిర్మిస్తున్నామని నాబార్డు రాష్ట్ర ఈఈ గోపాల్‌రావు అన్నారు. త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో సుమారు రూ.33లక్షల నాబార్డు ఆర్థిక సహకారంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన గోదాంను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లు రైతులకు ఉత్తమ సేవలు అందిస్తూ, వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దదేవులపల్లి పీఏసీఎస్ చైర్మన్ మందడి నాగేందర్‌రెడ్డి, నాబార్డు ఏఈ చంద్రశేఖర్, బీడీఓ మణికాంత్, నోడల్ అధికారి సుగుణ, సివిల్ ఇంజనీర్ సీతారామరెడ్డి, సీఈఓ గోవర్ధన్, సైదులు, విష్ణు పాల్గొన్నారు.

బుద్ధవనం సందర్శించిన అటవీశాఖ రీజనల్ డైరెక్టర్

నాగార్జునసాగర్: అటవీశాఖ రీజనల్ డైరెక్టర్ త్రినాథ్‌రావు బుధవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. అమ్రాబాద్ ఫారెస్ట్ రిజర్వ్ పరిధిలో శాఖాపరమైన తనిఖీల్లో భాగంగా ఆయన సాగర్ అటవీ ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తూ బుద్ధచరితవనం, ధ్యానవనం, స్థూపవనం, మహాస్థూపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుద్ధవనం అద్భుతమైన నిర్మాణమని పేర్కొన్నారు. వీరికి గౌడ్ సత్యనారాయణ బుద్ధవనం చారిత్రక ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రాంబాబు, నాగార్జునసాగర్ ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, స్థానిక అటవీ శాఖ అధికారి రమేశ్ పాల్గొన్నారు.


బుద్ధుడి విగ్రహం వద్ద అటవీశాఖ రీజనల్ డైరెక్టర్ త్రినాథ్‌రావు తదితరులు

ప్రసాదం కాంప్లెక్స్ మెట్ల మార్గంలో షెడ్డు నిర్మాణం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఎక్కువగా కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్నారు. అంతేకాకుండా శివాలయం చెంతనే ఉన్న ప్రసాదం విక్రయశాలకు వెళ్లి ప్రసాదం కొనుగోలు చేసి మెట్ల మార్గంలో బస్‌బే వద్దకు వెళ్తుంటారు. ఈ మార్గంలో ఎటువంటి నీడ లేకపోవడంతో పాటు మండుటెండకు కృష్ణశిల స్టోన్ ఫ్లోరింగ్‌పై వెళ్లే భక్తులకు కాళ్లు కాలుతున్నాయి. దీనిని గమనించిన అధికారులు ప్రసాద కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న మెట్ల మార్గంలో రేకులతో షెడ్డును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులను సిబ్బంది వేగంగా చేస్తున్నారు. వేసవిలో భక్తులకు ఈ మెట్ల మార్గంలో సేద తీరేందుకు సైతం వీలు ఉంటుందని భావించిన ఆలయ అధికారులు ఈ షెడ్డు నిర్మాణాన్ని వేగంగా చేస్తున్నారు.


మోడలింగ్ షోకి గౌరవ అతిథిగా మూసాఅలీఖాన్

మిర్యాలగూడ టౌన్: హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల తాజ్ బంజారా హోటల్‌లో ఈ నెల 12న జరగనున్న రిఫ్రిడ్ మోడలింగ్ షోకి గౌరవ అతిథిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన సినీ నటుడు, సామాజిక సేవకుడు, నిర్మాత మూసా అలీఖాన్ హాజరుకానున్నారు. ఈ మేరకు మోడలింగ్ షో నిర్వాహకులు సయ్యద్ అమీర్, పూజా గుప్తా నుంచి బుధవారం మూసాఅలీఖాన్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది.


మూసాఅలీఖాన్

ఊపందుకున్న ఘాట్ రోడ్డు విస్తరణ పనులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి కొండపైకి వెళ్లే మొదటి ఘాట్ రోడ్డు గతేడాది కురిసిన వర్షాలకు కుంగిపోయింది. దీంతో అధికారులు ఘాట్ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు మరమ్మతులు చేపట్టారు. సుమారు రూ.4కోట్లతో 7 మీటర్లు ఉన్న ఘాట్ రోడ్డును 12 మీటర్ల వెడల్పుకు పెంచుతున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఈ పనులను దగ్గరుండి చేయిస్తున్నారు. ఈ నెల చివరి వరకు పనులను పూర్తిచేసి మొదటి ఘాట్ రోడ్డును అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం మూడవ ఘాట్ రోడ్డు గుండా వాహనాలు కొండపైకి రాకపోకలు సాగిస్తున్నాయి.


మొదటి ఘాట్ రోడ్డులో పనులు చేస్తున్న కూలీలు

వ్రత మండపం వద్ద వాహన పూజలు

యాదగిరిగుట్ట: నూతన వాహనాలు కొనుగోలు చేసిన యాజమానులు ఎక్కువగా యాదాద్రీశుడి చెంత పూజలు చేయించడం సంప్రదాయంగా వస్తుంది. భక్తుల సౌకర్యార్థం వాహన పూజల షెడ్డును శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం వద్ద ఏర్పాటు చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆలయాభివృద్ధి ముందు మొదటి ఘాట్ రోడ్డులో ఈ వాహన పూజల షెడ్డు ఉండేది. ఘాట్ రోడ్డుతో పాటు కొండ చుట్టూ గ్రీనరీ పనులు చేపట్టడంతో ఈ షెడ్డును పాత గోశాలలోకి మార్చారు. అక్కడే వ్రత మండపం సైతం ఉండేది. ఇటీవలే శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపాన్ని పూర్తిచేసి దానిని అందుబాటులో తీసుకురావడంతో భక్తుల సౌకర్యార్థం వ్రత మండపం పక్కనే వాహనాల పూజల కోసం షెడ్డును ఏర్పాటు చేసి వినియోగిస్తున్నారు. ఇక్కడ వాహన పూజలు చేసుకున్న భక్తులు నేరుగా మూడవ ఘాట్ రోడ్డు నుంచి యాదాద్రి కొండపైకి వెళ్లనున్నారు.


వ్రత మండపం పక్కన ఏర్పాటు చేసిన షెడ్డులో వాహన పూజలు చేస్తున్న అర్చకులు

మద్యం తాగేందుకు వచ్చి.. మురుగు గుంటలో శవమై..

- అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి
- మఠంపల్లిలో వెలుగుచూసిన ఘటన
- మృతుడు ఆంధ్రా ప్రాంత వాసి

మఠంపల్లి: అదృశ్యమైన యవకుడు మురుగు గుంటలో శవమై తేలాడు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన గల్లా నతానియేల్ (26) స్నేహితులతో కలిసి తరచూ మద్యం సేవించేందుకు మఠంపల్లి మండల కేంద్రానికి వచ్చి పోతుంటాడు. ఈ నేపథ్యంలోనే నతానియేల్ ఈ నెల 6వ తేదీన ఇద్దరు స్నేహితులతో కలిసి మఠంపల్లిలోని ప్రధాన రహదారి పక్కన గల పంజాబీ దాబాకు వచ్చారు. అక్కడ మద్యం సేవించిన తర్వాత ఇద్దరు స్నేహితులు స్వస్థలానికి వెళ్లిపోగా నతానియేల్ ఇంటికి వెళ్లలేదు. దీంతో మరుసటి రోజు (7వ తేదీన) అతడి తండ్రి ప్రసాదరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదైంది. అయితే, బుధవారం ఉదయం స్థానికులు మురుగు గుంటలో తేలిన మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు ప్రసాదరావు, ఇతర కుటుంబ సభ్యులు వచ్చి మృతుడు నతినియేల్ అని గుర్తుపట్టారు. హత్య చేసి మురుగు గుంటలో పడవేశారని, నిందితులను కఠినంగా శిక్షించాలని కొద్ది సేపు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కాగా, పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అయితే, మఠంపల్లికి నతానియేల్‌తో పాటు వచ్చిన ఇద్దరు స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ప్రసాదరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మఠంపల్లి ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.